క్లుప్తంగా

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్

నల్లచెరువు: స్థానిక పోలిస్‌స్టేషన్‌ను కదిరి డీఎస్పీ భవ్యకిషోర్ బుధవారం తనిఖీ చేశారు. పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మండలంలో శాంతి భద్రతలు, పెండింగ్ కేసుల గురించి ఎస్సై వరలక్ష్మితో చర్చించారు. డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. రూరల్ సీఐ శివశంకర్ నాయక్, ఏఎస్సై షెక్షావలి, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా రామకృష్ణా రెడ్డి



చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా న్యామద్దల రామకృష్ణారెడ్డిని నియమించినట్లు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మండల కన్వీనర్‌గా ఎంపిక చేసినందుకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్టీసీ స్థలాల లీజుకు నేడు సమావేశం

కదిరి అర్బన్: కదిరి డిపో ఆర్టీసీ స్థలాలను 33 ఏళ్ల లీజుకు ఇచ్చేందుకు గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు డీఎం మైనోద్దీన్ బుధవారం తెలిపారు. జిల్లా ప్రజారవాణా అధికారి మధుసూదన్ హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు డీఎం కార్యాలయంలో సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఈ సమావేశానికి హాజరై లీజు వివరాలు తెలుసుకోవడంతో పాటు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.

గుడి నిర్మాణానికి విరాళం

నల్లచెరువు: తలమర్లవాండ్లపల్లి గ్రామం వి.రమణప్పగారి పల్లిలోని అంబేడ్కర్ కాలనీలో నిర్మించనున్న నాగదేవత గుడి నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నాయకుడు వై. రాంకిషోర్ రెడ్డి బుధవారం రూ. 20 వేలు విరాళంగా గ్రామస్తులకు అంజేశారు. కార్యక్రమంలో 12వ వార్డుమెంబర్ నాగరాజు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా మంజుల నరేంద్ర



మంజుల నరేంద్రకు నియామక పత్రాన్ని అందిస్తున్న నాయకులు

ధర్మవరం అర్బన్: ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా మంజుల నరేంద్రను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ తెలిపారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగన అశ్వర్థనారాయణ, ధర్మవరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రసాద్‌లు రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన నరేంద్రకు నియామకపత్రాన్ని అందించారు.

మొక్కజొన్న పంట పరిశీలన

తలుపుల: మండలంలోని గుండువారిపల్లి గ్రామంలో రైతు మోహన క్రిష్ణ సాగుచేసిన మొక్క జొన్న పంటను బుధవారం శాస్త్రవేత్తలు వెంకటరమణ, వేమన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఏడీఏ సత్యనారాయణ మాట్లాడుతూ రైతు మోహన క్రిష్ణ అడ్వాంటా రకం మొక్క జొన్న సాగు చేశారన్నారు. పంట కాలం సుమారు వంద రోజులు పూర్తి కావచ్చిందని, ఒక్క జొన్న మొక్కకు మూడు, నాలుగు కంకులు రావడంపై ఫిర్యాదు చేయడంతో పరిశీలించారన్నారు. కార్యక్రమంలో ఏఓ షాదాబ్, వీఏఓలు, రైతులు మోహన క్రిష్ణ, చలమయ్య పాల్గొన్నారు.

పంట పొలాల సందర్శన



అగ్రహారం పొలంలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ, సిబ్బంది

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం అగ్రహారం తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసుకున్న పంట పొలాలను బుధవారం ఏడీఏ వెంకటేశ్వర్లు సందర్శించారు. పంట నమోదు చేసిన విధానం గురించి సిబ్బందిని వివరాలనడిగి తెలుసుకున్నారు. పంట నమోదును ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఏఓ సతీష్, ఏఈఓ సుధ, వీఆర్వో హరి, రైతులు గోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సికిందర్, ఆర్‌బీకే సిబ్బంది అనూష తదితరులు పాల్గొన్నారు.

వీరనారాయణుడి పరుషకు ఏర్పాట్లు పూర్తి

- భవిష్యవాణి వినేందుకు వేలాదిగా తరలిరానున్న భక్తులు



వీరనారాయణస్వామి ఆలయం



స్వామి కొలువు తీరే ప్రదేశం

ముదిగుబ్బ: మండల పరిధిలోని సంకేపల్లిలో పరుష మాన్ల వద్ద ఏటా మహా శివరాత్రి మరుసటి రోజున నిర్వహించే వీరనారాయణస్వామి పరుషకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కమ్మవారిపల్లిలో ఉన్న వీరనారాయణ స్వామి ఆలయం నుంచి శివరాత్రి పర్వదినం రోజున ఉదయాన్నే ఉపవాస దీక్షలతో కాలినడకన భక్తులు, ఆలయ పూజారులు కన్యకలగొంది చేరుకుంటారు. అక్కడ వెలసిన శివాలయంలో శివునికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు. అనంతరం డప్పు వాయిద్యాలతో బుక్కపట్నం మండలం పరిధిలోని పాముదుర్తికి వెళ్లి వీరనారాయణస్వామి వారికి ప్రీతిపాత్రులైన పూజారి తాళ్ల జంగమన్న వంశస్తులు వెదురు దబ్బతో అల్లి తయారు చేసిన వెలగ (వెలమ) గంపను తీసుకొని పాముదుర్తిలోని రెడ్డివారి బావి వద్ద గంగ పూజ నిర్వహిస్తారు. అక్కడ నుంచి కన్యగల గొందికి చేరుకొని శివాలయంలో వెలగ గంపను పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తారు. స్వామి వారి వెలగ గంపను డప్పు వాయిద్యాల మధ్యన గుంజేపల్లి మీదుగా సంకేపల్లి వద్ద ఉన్న పరుషమాన్ల వద్దకు చేర్చి వీరనారాయణస్వామి వెలగ గంపను ప్రతిష్ఠింపజేస్తారు. ఈ పూజలన్నీ నిర్వహించడానికి ఒక రోజు సమయం పడుతుంది. జాగారం మరుసటి రోజున పరుష మాన్లలో వీరనారాయణస్వామికి పూజారులు గంగమోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించి పరుష ప్రారంభిస్తారు. పరుషలో స్వామి (వెలగ గంప)ని దర్శించుకుంటే ఎలాంటి ఆపదలు కలుగవని భక్తుల నమ్మకం. వెలగ గంపలోనే స్వామి వారి ఆవాహమై ఉంటారని భక్తులు విశ్వసిస్తారు.

భారీగా తరలి రానున్న భక్తులు..

రైతులు ఎడ్ల బండ్లను, కొత్తగా కొన్న పశువులను, ట్రాక్టర్లను, ఇతర వాహనాలను స్వామి వారి ఆలయం (వెలగ గంపను ఉంచిన ప్రదేశం) చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు. ఇలా చేయడం వల్ల ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా స్వామి ఏడాది పొడవునా కాపాడతాడని, ప్రజలు సుభిక్షంగా ఉంటారని భక్తుల నమ్మకం. పరుష రోజున నల్లమేకల సాయి అనే వ్యక్తిని స్వామి వారు ఆవహించి భవిష్యవాణి (జరగబోయే విషయాలను) చెపుతారు. దీని ఆధారంగా రైతులు ఈ ఏడాది వర్షాల ఆగమనం, పంటలు పండే తీరు తెలుసుకొని వాటికి అనుగుణంగా వ్యవసాయ పనులకు సిద్ధమవుతారు. పరుషకు మన రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు.

వసతులు కల్పించేరా?

లక్షలాది మంది భక్తులు హాజరయ్యే పరుషకు వసతులు కల్పించడంలో అధికారులు ప్రతి సారి విఫలం అవుతున్నారు. మంచినీటి సౌకర్యం లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతుంటారు. దీంతో పాటు పరుష మాన్ల వద్దకు వెళ్లే రహదారి వన్‌వే కావడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉండేది. పరుషలోకి వెళ్లడానికి సంకేపల్లి మీదుగా తిరిగి బయటకు రావడానికి కమ్మవారిపల్లి మీదుగా వచ్చే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని మండల ప్రజలు భావిస్తున్నారు. వసతులను కల్పించాలని కోరుతున్నారు.

పాతూరులో పెద్దమ్మ స్వామి పరుష

ముదిగుబ్బ పాతూరులో వెలసిన పెద్దమ్మ స్వామి ఆలయాన్ని శివరాత్రి పర్వదినం సందర్భంగా ముస్తాబు చేస్తారు. జాగారం రాత్రి పెద్దమ్మస్వామి మూల విరాట్‌ను ఆలయం నుంచి బయటకు తీసి పల్లకిలో గ్రామ పురవీధుల గుండా ఊరేగిస్తారు. తెల్లవారే సరికి గ్రామం వెలుపల వున్న నల్లలమ్మ స్వామి ఆలయం వద్దకు తీసుకెళతారు. అక్కడ పెద్దమ్మస్వామి పరుష ఘనంగా నిర్వహిస్తారు. ఈ వేడుకకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. పరుష మూడు రోజుల పాటు జరుగుతుంది.

సమన్వయంతో పనిచేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ తాతం జగన్మోహన్

గాండ్లపెంట: ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ తాతం జగన్మోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు ఆయా శాఖల పురోభివృద్ధిని వివరించారు. ఏఓ లక్ష్మీప్రియ మాట్లాడుతూ రబీ సీజన్‌లో మండలవ్యాప్తంగా 704 మంది రైతులు 1,867 ఎకరాల్లో సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేయించుకున్నారని చెప్పారు. మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. వైద్యాధికారి మహేశ్వరమారుతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 'అమ్మవారు '(చికెన్‌పాక్స్) ప్రబలుతుందోదని, గ్రామాల్లో ఇంకా ఎవరైనా వైద్యం అందని వారు ఉంటే ప్రజాప్రతినిధులు వారికి తెలియజేసి ఆసుపత్రికి పంపాలని కోరారు. ఎంఈఓ క్రిష్ణానాయక్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేశామని చెప్పారు. వేపరాల సీఎం తండా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకున్నారని, వేపరాలలో చెరువు స్థలాన్ని సైతం కొంత మంది ఆక్రమించుకుంటున్నారని సర్పంచ్ తెలిపారు. కురుమామిడి సర్పంచ్ సుధాకర మాట్లాడుతూ నిధులు రాక పనులు చేయించలేక పోతున్నామన్నారు. మండల సమావేశానికి గైర్హాజరైన విద్యుత్, రవాణాశాఖ, రోడ్లు భవనాలశాఖ, మత్స్యశాఖ సిబ్బందిపై జిల్లా కలెక్టర్‌కు నివేదించాలని ఎంపీపీ ఆదేశించారు. పథకాలు ఎలా అమలవుతున్నాయో తెలుసుకోవాలంటే అధికారులు కూడా సమావేశాలకు రావాలని సూచించారు.

సభ్యులు కాని వారు హాజరు

కాగా, మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు కాని వారు సైతం హాజరు కాగా అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. సమావేశంలో వైస్ ఎంపీపీలు గంగోజమ్మ, పులగంటి భారతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, ఎంపీటీసీలు ఖమర్‌జహాన్, సోమశేఖరరెడ్డి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ మిల్లు ప్రారంభం



మాట్లాడుతున్న సీఈఓ త్రిలోచన శాస్త్రి

తాడిమర్రి: రైతులు దళారులతో మోసపోకూడదనే ఉద్దేశంతోనే వేరుశనగ మిల్లు ప్రారంభించినట్లు సెంటర్ ఫర్ కనెక్టివిటీ డెవలప్‌మెంట్ సీఈఓ త్రిలోచన శాస్త్రి పేర్కొన్నారు. స్థానిక శివంపల్లి రహదారిలో బుధవారం శ్రీసత్యసాయి రైతు సహకార పరపతి సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేరుశనగ మిల్లు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భాగస్వామ్యంతో వేరుశనగ మిల్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాఖ్యల సహకారంతో కళ్యాణదుర్గం, గుట్టూరు మండలాల్లో వేరుశనగ మిల్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు విరాళాల రూపంలో రూ.6 లక్షలు ఇవ్వడంతో సెంటర్ ఫర్ కనెక్టివిటీ డెవలప్‌మెంట్ (సీసీడీ) రూ.36 లక్షలు ఆర్థిక సహాయం అందించిందన్నారు. దీంతో మిల్లులో యంత్రాలను ఏర్పాటు చేశామన్నారు. వేరుశనగ పంటకు గిట్టుబాటు ధరతో ఇక్కడ కొనుగోలు చేసి, కేవలం ఒక్క రోజులోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తామన్నారు. ఉచితంగా వేరుశనగ కాయలను ఆడించడమే కాక నాణ్యమైన విత్తనం, కొత్త వంగడాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సమాఖ్య అధ్యక్షులు జీవీ రమణారెడ్డి, డైరెక్టర్ వరప్రసాద్, టీం లీడర్ విశ్వనాథ్, ఫీల్డు ఆఫీసర్ సుదర్శన్, రైతులు హరి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అన్నదాన కార్యక్రమం



ఆలయంలో అన్నం వడ్డిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ

బత్తలపల్లి: బత్తలపల్లిలోని లలితా త్రిపుర సుందరి సమేత ఓంకారేశ్వరుని ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం బుధవారంతో ముగిసిందని అన్నదాన కమిటీ సభ్యులు షరాబ్ యోగానందాచారీ, కమతం లక్ష్మీనారాయణ తెలిపారు. ఆలయ శాశ్వత ధర్మకర్తలు, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో జనవరి 10వ తేదీన ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం ఫిబ్రవరి 15వ తేదీన ముగిసినట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు బుధవారం అన్నదాన కమిటీ సభ్యులు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ కోటి సుధ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ 41 రోజుల పాటు శివస్వాములకు ఉచితంగా భిక్షను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం అన్నదాన కమిటీ సభ్యులు జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, ఆలయ అర్చకులు కేశవస్వామి, దాతలు, వంట మాస్టర్లు, పంచాయతీ కార్మికులను, అన్నదాన కార్యక్రమానికి సహకరించిన వారందరికీ పూలహారం, దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వామి రామాంజనేయులు, జ్వాలాపురం గోపాల్, పాల్యం సతీష్, యాపిల్ నాయుడు, బిల్లే సూరీ, బిల్లే సురేష్, కోటి అంజి, బిల్లే వెంకటనారాయణ, చిత్ర భాస్కర్, సిందే కిరణ్, సాకే నరేష్, విజయ్‌కృష్ణ, గోట్లూరు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మయ్య

పుట్టపర్తి: గ్రామీణ ప్రాంతాలలో సైతం డిగ్రీ తదితర కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే క్రమంలో ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య అన్నారు. ఆయన బుధవారం నైపుణ్యాలపై కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీలో చేరి నైపుణ్యాలపై ఉచితంగా శిక్షణ పొందవచ్చునన్నారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి ఖయ్యూం మాటాడుతూ కళాశాలలో స్కిల్ హబ్ ఏర్పాటు చేశామని డిగ్రీ చదివే విద్యార్థులతో పాటు ఇప్పటికే పూర్తి చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీబాలాజీ జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యారు.

ఆర్థిక సాయం అందజేత

పుట్టపర్తి అర్బన్: ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు ఆంధ్ర-తెలంగాణ సబ్ ఏరియా కేంద్ర కార్యాలయం అధికారులు ఆర్థిక సాయం ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున ఏరియా క్యాంటీన్ మేనేజర్ మారుతీ ప్రసాద్ బుధవారం అనంతపురంలో అందజేశారు. షేక్ మహమ్మద్ సతీమణి రమీజా బేగం(గుత్తి), జాఫర్ హమీద్ భార్య పి.హమీద బాను(అనంతపురం), వాల్మీకి రామయ్య భార్య వాల్మీకి నాగమణి(కొత్తచెరువు)కు ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు.

18న రథోత్సవం

ధర్మవరం అర్బన్: శివానగర్ శివాలయంలో ఈనెల 18న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహా శివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 7.30 గంటలకు మడుగుతేరు, మధ్యాహ్నం 2గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించనున్నారన్నారు.

నేడు 'స్పేస్ ఆన్ వీల్స్'

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం స్పేస్ ఆన్ వీల్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారని కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇస్రో డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళీధర్ పర్యవేక్షణలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నామన్నారు. ఫోటో గ్యాలరీ, ఇస్రో సాధించిన విజయాలు, స్పేస్ నెట్‌వర్క్‌లో వినియోగించే యాంటినాలు, రిమోట్ సెన్సింగ్ సంబంధించిన విషయాలు, జీఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, హిట్ షీల్డ్, రాకెట్లకు సంబంధించిన వివిధ రకాల నమూనాల పట్ల అవగాహన కల్పించేందుకు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. కళాశాలల విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను సందర్శించి ఇస్రోపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు.

వైభవంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్ట



మాట్లాడుతున్న ట్రస్ట్ సభ్యులు రత్నాకర్, వెంకటరామిరెడ్డి

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి తాండాలో బుధవారం మారెమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఆర్‌జే రత్నాకర్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, మాజీ రెస్కో ఎండీ దుద్దుకుంట వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు, యువత విద్యలో రాణించాలన్నారు. గిరిజనుల జీవన శైలిలో మరింత మార్పు రావాలన్నారు. దశల వారిగా ట్రస్ట్ సేవలు విస్తరిస్తామన్నారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత, పవన్, సూర్యాగౌడ్, చెరువు భాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, సతీష్‌నాయక్, రాజేష్, బాలకృష్ణనాయక్, రామస్వామినాయక్, కడపరాజ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ధర్మవరం: సచివాలయాల ద్వారా ప్రజలందరి సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. పట్టణంలోని జగజ్జీవన్‌రామ్‌నగర్‌లోని సచివాలయాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించిన అనంతరం ఇంటింటా తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నారా? లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటా సర్వేను మరింత వేగంగా చేయాలని తెలిపారు. ప్రజలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు సమకూర్చే విధంగా ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

తనకల్లు: మండలం లోని చీకటిమానిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ధర్మవరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఎంఈఓ సుధాకర్‌నాయక్ బుధవారం ఎమ్మార్సీ భవనంలో ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలపై మార్చి 5,6 తేదీలలో నెల్లూరులో జరిగే ఏపీయుఎస్ రాష్ట్ర మహాసభలకు ఉపాధ్యాయులు తరలిరావాలని ఏపీయుఎస్ కోశాధికారి అన్నం అరవింద్ తెలిపారు.

గ్రామీణులకు వైద్య సేవలు

తాడిమర్రి: మండలంలోని కునుకుంట్ల గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనం సిబ్బంది, ఎంపీహెచ్ఓ నారాయణస్వామి, ఎంఎల్‌హెచ్ఓ సాయికీర్తన తదితర వైద్య సిబ్బంది గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ దీర్ఘకాలిక రోగాలతో ఇంటి పట్టున ఉన్న రోగులకు చికిత్సలు అందించి, మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవన్నారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు, చేపలు, మాంసం తదితర పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణ మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో పార్వతీ పరమేశ్వరులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చెరువుకట్టవద్దనున్న కాశీ విశాలాక్షి సహిత శ్రీ కాశీ విశ్వనాథస్వామి దేవాలయంలో బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకనాథ్ శర్మ ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణ తదితర పూజలతోపాటు పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవమూర్తులను ప్రత్యేక పూలు, ఆభరణాలతో అలంకరించి వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఉత్సవంలో శివమాలధారులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'వెన్నపూస'ను గెలిపించాలి



ఆర్డీఓ కార్యాలయంలో సిబ్బందిని ఓటు అభ్యర్థిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి సోదరుడు వెన్నపూస హరినాథ్ రెడ్డి, ధర్మవరం నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ చింతకాయల నరేష్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు పాఠశాలలు, సచివాలయాలు, న్యాయవాదులు, బ్యాంకు సిబ్బందిని బుధవారం కలిశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రవీంద్రరెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

డ్రిప్ పైపుల అపహరణ

ముదిగుబ్బ: మండల పరిధిలోని మర్తాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డికి చెందిన డ్రిప్పు పైపులను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు తన తోటలో రూ.35 వేలు విలువ చేసే డ్రిప్పు పైపులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారన్నారు. ఈ చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తనకల్లు: స్థానిక బూడిదగడ్డ వీధిలో ఉన్న సీతారామాస్వామి దేవాలయంలో బుధవారం మహాగణపతి, సుబ్రమణేశ్వర స్వాముల విగ్రహాల ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ఎస్‌డీఆర్ఆర్ కళాశాల సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ముదిగుబ్బ పాతూరుకు చెందిన రామక్రిష్ణ పెట్రోల్ బంక్ వద్ద నుంచి ద్విచక్ర వాహనంలో రోడ్డుపైకి వచ్చాడు. అదే క్రమంలో వెనుక వైపు నుంచి కుల్లాయప్ప అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కుల్లాయప్ప పరిస్థితి విషమంగా వుండడంతో 108లో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.